# నాకు మిగిలిన దిదే!

“రాజగోపాల్!

ఆశ్చర్యపోతున్నారు కదూ?

మన స్నేహమే విచిత్రమైనది.

ఆ రోజు...మన పరిచయానికి నాంది గీతం పాడిన ఆ రోజు...మరపురానిదే.

కాలేజీ గేట్‌లోనుండి వస్తున్నాను నేను. ప్రైవేట్ క్లాస్ ఉండటం మూలాన ముందుగా వచ్చాను. ఎప్పుడూ అసంఖ్యాకులైన విద్యార్థులతో నిండి కోలాహలంగా ఉండే ఆ పరిసరాలన్నీ ఇంకా టైమవకపోవటం వలన నిశ్శబ్దంగా ఉన్నాయి.

‘రాజా! నీ రాణి వస్తూంది!’ అతి నెమ్మదిగా అన్నా రెవరో.

అప్రయత్నంగా తల పక్కకి తిప్పి చూశాను.

చిన్నగా నవ్వి, తదేక దృష్టితో నా వంకే చూస్తూన్న మీరు కనిపించారు!

చకిత నయాను నేను.

మీరు కాలేజీలో కొత్తగా చేరారనీ,



మీ పేరు రాజగోపాల్ అని ఆ తరవాత తెలిసింది నాకు.

ఏమీ పట్టించుకోనట్లే ముందుకు నడిచి వెళ్లిపోయాను నేను. మీ రక్కడే ఉండిపోయారు.

స్నేహితుల పరిహాసానికి సిగ్గు పడుతున్నట్లు నవ్వి, నా వంకే కేంద్రీకరించిన మీ చూపులు మాత్రం నా మనస్సును వెన్నంటి కలవరపెట్టాయి.

వెర్రిదాన్ని మీ మూర్తి నా మనో వీధిలో తారట్లాడింది.

ఆ రోజంతా అన్యమనస్కంగానే ఉన్న నా వైఖరికి మా స్నేహితురాళ్లు తికమక పడ్డారు.

ఆ రోజే,—క్లాసు జరుగుతూంటే యధాలాపంగా తల తిప్పిన నాకు కిటికీ లోంచి నా వంక చూస్తున్న మీరు కనిపించారు.

నే నటు చూడగానే మీ కళ్లలో నవ్వురేఖలు దోబూచులాడాయి. మరు క్షణంలో తల వంచుకొని మీరలా వెళ్లి పోయారు. గుండె దడదడలాడింది.

ఏమీ అర్థం కాలేదు నాకు.

ఏ రహస్యం మాత్రం ఎన్నాళ్ళు దాగుతుంది?

మీ ప్రవర్తనము మా స్నేహితురాళ్లు పసిగట్టేశారు.

ఎప్పుడూ నా వెంట ఉండే ఉమా, వనజా, జ్యోతీ ఈ విషయం నా చెవిలో గుసగుస లాడారు.

ఏమనగలను నేను? నిశ్శబ్దంగా ఉండిపోయాను.

'ఇంకా కొన్నాళ్లు చూద్దాంలే!' వాళ్లలో వాళ్లే సమాధానపడ్డారు.

ఆ రోజు మాకు ప్రైవేట్ క్లాస్ పెడతానన్నవారు—మాస్టారు ఎంతకీ రాలేదు.

'వెయిటింగ్ రూమ్‌కి పోదామా, వనజా?' అంటూ గుమ్మంవైపు తిరిగాను.

మా క్లాస్‌మేట్స్‌తో కలిసి అప్పుడే గుమ్మంలో అడుగు పెడుతున్న మీరు కనిపించారు.

గాభరాగా దృష్టి మరల్చుకొన్నాను. కాని ఆ లోపలే మీరు నన్ను చూశారు.

ఆ క్షణాన మీ కళ్లలో ఒక వింత కాంతి తొంగి చూసింది.

ఆనందరావు మిగిలినవాళ్లకి పరిచయం చేస్తున్నాడు మిమ్మల్ని — 'రాజగోపాల్. ఫైనలియర్‌లో కొత్తగా చేరాడు. వెరీ బ్రిలియంట్ స్టూడెంట్. ఎ వెరీ గుడ్ సింగర్ ఆల్సో.'

మా క్లాస్ అబ్బాయిలందరూ మిమ్మల్ని పాట పాడమని బలవంత పెట్టారు.

'క్లాస్ ఇంక ఉండదండీ బహుశా. మీరు వెయిటింగ్ రూమ్‌కి వెళ్లి పోతారా? లేకపోతే మీరూ విందురు గాని ఇక్కడే ఉండండి.' ఆనందరావు వచ్చి నన్నడిగాడు.

నాతోపాటు మిమ్మల్ని గుర్తు పట్టిన అమ్మాయిలందరూ వింతగా, కుతూహలంగా చూస్తున్నారు.

ఏం చేద్దా మన్నట్లు వాళ్ల వంక చూశాను.

'మనం విందాం' అని ఉత్సాహం చూపారు చాలా మంది.

'ఉంటామండీ' అని చెప్పాను నేను.

ఆత్రంగా నన్ను చూస్తున్న మీ

# 'అనుపమ'

కన్నుల్లో తృప్తి నాట్యం చేసింది.

ఆనందరావు కాలేజీలోనే కాక, మా కుటుంబానికి బాగా తెలిసినవాడు; సహృదయుడు. అతని సహకారం, సానుభూతి నాకు చాలా ఉన్నాయి.

వాళ్లందరూ మీకు కుర్చీ తెచ్చి వేసి మిమ్మల్ని ఆసీనుల్ని చేశారు.

మీ మధుర గంభీరస్వరం వీనుల విందు చేసింది.

'న తుమ్ హమే జానో—న హమ్ తుమ్హే జానే—
మగర్ లగ్‌తా—హై కుఛ్ ఐసా మేరా హమ్‌దమ్—మిల్ గయా. . .'

ఆ పాట నాకు ప్రాణం!

మిమ్మల్ని మనసులోనైనా అభినందించకుండా ఉండలేకపోయాను.

'హలో, రాజా! ఇక్కడున్నావా?' విన్న కంఠంలా అనిపిస్తే తల ఎత్తి చూశాను.

ఆ రోజు—మొదటి రోజున—మీ చుట్టూ ఉన్నవాళ్లు అని సులభంగానే గుర్తు పట్టాను.

'గోపాల్, బోల్ రాధా బోల్ పాడు.' వాళ్లు బలవంతం చేస్తున్నారు.

'బోల్ రాణీ అనాలేమో?' ఉలిక్కిపడ్డాను అత నెవడో కాని బాగా ఆకతాయి లాగ ఉన్నాడు.

'ఏదయినా సరిపోతుంది. పర్వాలేదులే.' నవ్వా డింకొక అబ్బాయి.

ఇంకేముంది? మా క్లాస్ అబ్బాయిలకి అంత క్రితమే చూచాయగా తెలుసులా ఉంది—ఆ రోజుతో పూర్తిగా అర్థమై పోయింది.

ఆ రోజు మీరు చాలా పాటలు పాడారు.

'సౌసాల్ పెహలే', 'ఆజ ఆజారే', 'ఏ మెరా ప్రేమ్ పత్ర్' — మొదలైన వెన్నో!

ఫస్ట్ బెల్ అయినా మా వాళ్లు మిమ్మల్ని కదలనివ్వలేదు.

టైమయిపోతూందని అమ్మాయిలం ముందు లేచాం.

నేను గుమ్మం దాటుతూంటే, 'హే, రాజా!' అన్నా డాకతాయి.

ఆ రోజు ఒక అవర్ ఎగ్గొట్టేసి వెయిటింగ్ రూమ్‌లోకి చేరాం నలుగురం.

వనజది చాల స్ప్లెయిన్ బిహేవియర్. సూటిగా ఈ ప్రస్తావన తెచ్చి, 'నువ్వు ఏమనుకుంటున్నావు?' అనడిగింది.

ఏం చెపుతాను?

'అతను పాట పాడుతూ కూడా అస్తమానూ నీ వంక చూశాడు' అంది ఉమ. మళ్లీ, 'నువ్వంటే అతని కిష్టం కాబోలే!' అంది.

వెంటనే— 'ఏమో నే నలా అనుకోవటం లేదు, ఉమా! అల్లరికి కావచ్చు. అయినా కాని, ఏం చేయగలం మనం? ఏం చేసినా తొందరపడ్డ ట్లవుతుందేమో' అన్నాను.

'మహాశయా! మీ ఉద్దేశ్య మేమిటసలు అని అడిగేసి వస్తే?'

'తల్లీ! ఆ పని చేయకు. నీకు పుణ్య ముంటుంది' అన్నాను.

తరవాత వాళ్లేదో మాట్లాడుతూ కూర్చున్నారు.

నా చెవి కేమీ ఎక్కటం లేదు. పిచ్చెక్కినట్లుంది. 'ఇక పోదాం' అని లేచాను.

కొద్ది రోజుల తరవాతే మీరు సెకండియర్ గ్రూప్‌కు అనారోగ్య కారణంగా వెళ్లలేదని తెలిసింది.

అప్రయత్నంగానే 'అయ్యో!' అనుకున్నాను.

ప్రిన్సిపాల్ పెర్మిషన్ తీసుకుని మీరు తరుచు మా క్లాసెస్‌లో కూర్చుంటుండే వారు.

క్లాసు జరుగుతున్నంతసేపూ మీరు చాలా గంభీరంగానే ఉండేవారు.

ఆ గాంభీర్యాన్ని నేనూ మెచ్చుకోకుండా ఉండలేను!

కాని, క్లాసు మొదలయే ముందూ, తరవాతా మీ కళ్ళు నా మీదే ఉండేవి. చిరునవ్వుతో పలకరిస్తున్నట్లుండే చూపు!

మనం చాలా మంది మధ్య నున్నామని మరిచిపోయినట్లు ఉండేవారు మీరు.

నాకు తల ఎత్తటానికి జంకు కలిగేది అలాంటి సమయాలలో. మీ చేష్టల నెప్పటి కప్పుడు వర్ణించి చెప్పేవారు ఉమావాళ్లూ!

కొంచెం టైమ్ దొరికితే చాలు, మీ చేత పాటలు పాడించేవారు మా క్లాసువాళ్లు.

**కొన్ని నెలలపాటు ఆడుకుని ఆనందించాడు అతడు. తనతోపాటు తన స్నేహితులందరికీ వినోదాన్ని అందజేశాడు. షో కేస్‌లో తన ఆనందంకోసం పెట్టిన బొమ్మ అనుకున్నాడు! అందరి దృష్టిలోనూ మంచివాడు అన్న పేరు పోగొట్టుకొనకుండా జాగ్రత్తపడ్డాడు. జరిగిందేమిటి? పూలబాటలో నిర్దాక్షిణ్యంగా అసలైన మగవాడులా నడిచి వెళ్ళిపోయాడు. నలిగిన పూలు రోదిస్తున్నాయి. ఓదార్చేవారెవ్వరు?**

'మౌనముగా నీ మనసు పాడిన
వేణుగానమును వింటినే
తెలుపక తెలిపే అనురాగము నీ—
కనుల నే కనుగొంటినే
నీ మనసు నా దనుకొంటినే. . .'

సుడిగాలిలా వచ్చారు మా మిత్ర బృందం.

'రాజా! నిజమేనా? కంగ్రాట్యులేషన్స్. అయితే మాకు విందు భోజన మెప్పుడు, మరి?' కొంటెగా ప్రశ్నించా రెవరో.

అందరూ నవ్వారు.

కుంచించుకుపోయాను నేను.

ఎందుకో మీ ముఖంలో పేలినీడలు కదలాడాయి. మరో అయిదు నిమిషాలలో రూమ్ వీడిచి వెళ్లిపోయారు మీరు.

రాను రాను నేను నడిచి వెళుతూంటే 'రాజా!' అని వినిపించడం మొదలైంది.

నేను కనిపించగానే 'తేరా మేరా ప్యార్ అమర్' అని పాడుతూ ఉండేవారు అబ్బాయిలు.

ఒక రోజు ఫస్టవర్ ఎగ్గొట్టేసి ఒక మూల కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము మేము నలుగురం.

సడన్‌గా మీ గొంతు వినిపించింది. మే మక్కడ ఉన్నట్లు మీకు కనిపించదు.

'ఎందుకొచ్చినది, రాజా? ఆ అమ్మాయి ఈ వేళ రానట్లుంది. అయినా పిచ్చిలో పడి భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నావేమో?'

'నాన్సెన్స్, మధూ! ఆమెకన్న ఎక్కువా నా కవన్నీ?' గంభీరంగా పలికింది మీ గొంతు.

మా ఫ్రెండ్స్ వెంటనే నా వంక చూశారు.



భర్త — "దిగులుపడకు, ప్రియా! ఆనందించవచ్చు! మన హనీమూన్‌లో ఏకాంతంగా"

తల దించుకున్నాను నేను.

ఎందుకోగాని నా హృదయం పరవళ్లు తొక్కింది.

అంతదాకా మీరు నా పట్ల అల్లరిగా ప్రవర్తిస్తున్నారేమో అనుకున్నాను.

కాని ఆ రోజుతో నా అభిప్రాయం కొంత మార్చుకోవలసివచ్చింది.

నిజం చెప్పాలంటే, మీరు కాలేజీలో మంచిగా ప్రవర్తించే చాలా కొద్దిమంది అబ్బాయిల్లో ఒకరు.

ఏ అమ్మాయి నడిగినా — 'అతడు చాలా మంచివాడు. కనీసం చూడను కూడా చూడడు మన వంక' అని చెపుతుంది, మీ గురించి.

మీ రెవ్వర్నీ పట్టించుకొనేవారు కాదు. ఏ విధమైన అల్లరీ చేసేవారు కారు.

లెక్చరర్లందరి దృష్టిలో వినయం, తెలివితేటలు మూర్తీభవించిన మంచి విద్యార్థి మీరు.

మరి అంత మంచివారూ నా పట్ల ఎందు కలాగ ప్రవర్తిస్తున్నారో నా కర్థమయేది కాదు.

నే నేం చేయాలోకూడా నా కర్థ మయేది కాదు.

కాని, నా అలవాటు ప్రకారం సీరియస్‌గానే ఉండిపోయేదాన్ని.

నేను బాహ్యంగా మీకేనాడూ ఎలాంటి ప్రోత్సాహమూ ఇవ్వలేదు.

అపార్థాలకి సందివ్వట మెందుకని కాలేజీకి నిరాడంబరంగానే వచ్చేదాన్ని.

నేను పెద్ద అందమైనదాన్నని ఏనాడూ అనుకోలేదు. కాని, మీరు నేను బాగుంటానని అన్నారని తెలిసి నప్పుడు ఆశ్చర్యపోయాను. కాలేజీలో అబ్బాయిలు 'ఈ అమ్మాయి బాగుంటుంది' అన్నప్పుడూ నా కాశ్చర్యం వేసేది.

'మేరి ముహబ్బత్ పాక్ ముహబ్బత్'— మీరు పాడుతూ ఉండగా నేను క్లాసు లోకి వచ్చాను.

నేను కనబడగానే మీ కళ్లలో మెరుపులా సంతోషం తళుక్కుమంది.

నా మనస్సులో కోటి వీణలు మోగాయి.

'నా హృదయంలో నిదురించే చెలీ—
కలలలోనే కవ్వించే సఖీ
మయూరివై వయారివై నీవే. . .'

మీ గానం నా మనస్సుకు మత్తెక్కించింది.

కాని నా కర్తవ్యం కాబట్టి నిర్వికారంగానే ఉండిపోయాను నేను.

ఇలాంటి సంఘటన లెన్నో!

మీరు చాలా బాగా పాడగలగటం మీ మనస్సును వ్యక్తం చేయటానికి మంచి అవకాశాన్ని ఇచ్చింది.

మీరు మా ఇంటి వెనకాల సందులో రూమ్ తీసుకొని ఉంటున్నారని చాలా రోజుల తరవాతకాని నాకు తెలియనే లేదు.

మీరు ప్రతి రోజూ రాత్రి మా ఇంటి ముందునుండి అనేక పర్యాయాలు తిరుగుతున్నారన్న సంగతి నేను ఆలస్యంగానే గమనించాను.

నాకు తెలియకుండానే నా మనస్సు మీ చుట్టూ పరిభ్రమించేది.

మీ మూర్తిని తలుచుకొంటూంటే తెలియని అనుభూతి నన్నావరించేది.

'జనమ్ జనమ్ కా సాథీహై—
నిభానేకో
సౌ సౌ బార్ మైనే జనమ్ లియా...'

మీ కంఠం నా చెవులలో ప్రతిధ్వనిస్తుండేది.

'తూ మంజిల్ మై రాహీ హూఁ—
ఏక్ దిన్ తుఝ్ కో పాఊంగా'— మీ కంఠంలోని నిశ్చయం నన్ను ఊరడించేది.

కాని, నేను నా మనస్సెవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాను.

ప్రాణస్నేహితులకుకూడా నా భావాలను తెలియనీయలేదు.

మిమ్మల్ని చూడగానే ఎందుకో నాకు మీది కట్టుబాట్లు నతిక్రమించే తత్వం కాదని తోచింది.

మన పరిస్థితిని ఆనందరావు కూడా బాగా అర్థం చేసుకున్నాడు.

వివేకవంతుడైన అతడు దీని పరిణామాలను సరిగా ఊహించగలిగాడు.

అందుకనే కాబోలు — మొదట తేలికగా తీసుకొనటం వలన మిమ్మల్ని ప్రోత్సహించినట్లున్నా, తరవాత తరవాత ఉదాసీనంగా ఉండిపోయేవాడు.

కాని, అతని కున్న బాధ్యత మిగిలిన వాళ్ల కెందు కుంటుంది?

వాళ్లు మిమ్మల్ని అస్తమానూ మా క్లాసుకు తీసుకొచ్చి పాటలు పాడించేవారు.

నానిద్దరం ఒక చోట కనిపిస్తే చాలు, మీతో పని ఉన్నట్లు—'రాజా...రాజా' అని పదేపదే మీ పేరును ఉచ్చరించేవారు.

నన్ను చూడగానే—'రాజా! ఎ మేరా ప్రేమ్ పత్ర్ పాడు' అనేవారు.

'గోపాలుడు నిను వలచీ. . .' అని పాడుతూండేవారు.

'రాజా ఫైనలియర్ క్లాసుల్లో ఎందుకు కనిపిస్తాడు? సెకండియర్ క్లాసుల్లో ఉంటాడు' అనేవారు అబ్బాయిలు.

ఒక రోజు ప్రాక్టికల్ క్లాస్‌లో మామూలుగా తల ఎత్తేసరికి, వెనకకి తిరిగిపోయి నన్ను చూస్తున్న మీరు కనిపించారు!

మీ కన్నుల్లో కాంక్ష కొట్టవచ్చినట్లు కనిపిస్తూంటే ఆపాద మస్తకం వణికిపోయాను.

మీ చూపులలోని తపనం నన్ను వెన్నాడింది. 'నీవు నాకు కావాలి' అని బలవంతం చేస్తున్నట్లనిపించింది.

కాని, నాకూ స్థిరమైన ఉద్దేశ్యాలూ, ఆశయాలూ ఉన్నాయి.

కాలేజీ, క్లాస్‌రూమ్ అంటే అతి పవిత్రమైన భావం ఉంది నాకు.

క్లాస్ రూమ్ కొన్నిటికి మాత్రమే పరిమితం. విద్యాసదనమే కాని, అది ప్రేమనిలయం కారాదు.

ఆ వాతావరణ మెన్నడూ మలినం కారానిది.

కాని, మీరు మీ హృదయాన్ని వ్యక్తం చేసేందుకూ ఆ స్థలాన్నే ఎన్నుకొన్నారు.

విద్యార్థులుగా మా కర్తవ్యానికే ద్రోహం జరుగుతూందని ఎంతో బాధపడేదాన్ని.

కాని, నా చేతిలో ఏముంది?

నా వల్ల మాత్రం ఏ తప్పూ జరుగకుండా జాగ్రత్తపడ్డాను నేను.

నేను చాలా సీరియస్‌గా ఉంటానని మీరన్నారని తెలిసినప్పుడు—'అమ్మయ్య! నా విధిని నే నేమాత్రమూ మీరటం లేదన్నమాట' అని తృప్తిచెందాను.

తరవాత తరవాత మీరు మా ఇంటి ఎదురుగా స్నేహితులతో మాట్లాడుతూ వినిపించుకున్నట్లు నిలబడేవారు.

గంభీరమైన మీ వైఖరి ఎవరికీ అనుమానం కలుగకుండా రక్షించింది.

అంతా నాలోనే దాచుకున్నాను.

మొదట్లో మీరు నన్నల్లరి చేస్తున్నారేమో అన్న అనుమానం ఉండేది. మీరు నా ఎదురుగా చేసేదంతా నటనేనేమో అని వాడా అనుకున్నాను.


కాని, మీ ఫ్రెండ్సూ మీరూ మాటాడుకొనే మాటలు తెలిశాక ఆ అభిప్రాయం మార్చుకొన్నాను.

ఒక్కొక్కసారి మీ ప్రవర్తన చూస్తే ఎంత చులకన!—అని మండుకొచ్చేది నాకు.

చులకనే అయినా, అల్లరే అయినా చేసేదేమీ లేదు. రిపోర్టివ్వటం జరిగితే, ఇంక అబ్బాయిలు బ్రతకనీయరని తెలుసు.

కాని, మీరు చాలా గౌరవం కూడా చూపేవారు నా ఎడల.

ఒక రోజు లేబొరేటరీలో నేను మీకు ఎదురయ్యాను.



పుష్కరిణి

ఫోటో— టి. రాఘురామ్ (తిరుపతి)

పక్కనుండి వెళ్లిపోవటం మామూలుగా జరుగుతూండేదే. కాని, ఆ రోజు నే నెదురవగానే, తడబడిపోయి చటుక్కున తల వంచేసుకున్నారు మీరు.

వెంటనే నేను మరో పక్కకి వెళ్లిపోయాను. మీరూ ముందుకి వెళ్లిపోయారు.

మీరు అనురాగాన్నే కాక గౌరవాన్ని కూడా వ్యక్తం చేస్తూండటం మూలాన్నే నే నీ విషయాన్ని సహించగలిగాను.

లేకపోతే మీరు నన్ను తేలికగా చూస్తున్నట్లు భావించి ఉండేదాన్ని. ఆకతాయివేషాలుగా జమకట్టి ఉండేదాన్ని.

ఫైనలియర్ లోకి వచ్చి అంత టైమెందుకు వ్యర్థం చేసుకుంటున్నారా అని నాకు బాధ వేసేది.

ఆనందరావు దగ్గర ఈ విషయం కదిపితే, తన కేం తెలియనట్లే ఉండిపోయాడు. అంతకుమించి ఏం చేయగలడు?

మిత్రులైన మిమ్మల్ని ఏమనలేడు, బాగా తెలిసినదాన్నైన నేను బాధపడటమూ అతనికి ఇష్టం ఉండదు.

మనం మన చదువులు పాడుచేసుకున్నా, ఒకవేళ తలిదండ్రులనూ, కట్టుబాట్లనూ ఎదిరించి అల్లరిపాలైనా అతడు సహించలేడు.

అందుకే రాను రాను ఉదాసీనంగా ఉండిపోయేవాడు ఈ విషయంలో. అతడు చాలా వివేకవంతుడు!

కాలేజీలో కాంపిటీషన్లన్నిటిలో పాల్గొన్నారు మీరు. ఏవో ప్రైజులు కూడా వచ్చాయి.

క్లాసికల్ మ్యూజిక్‌లో ఫస్ట్ ప్రైజ్ తెచ్చుకున్న మీరు, లైట్ మ్యూజిక్‌లో 'మేరె మెహబూబ్ తుఝే' పాడటం మూలాన ప్రైజ్ పోగొట్టుకున్నారు. దేశభక్తి ప్రబోధకమైన పాట పాడిన మరొకరికి వచ్చింది అది.

'అతడు సెలెక్ట్ చేసుకున్న పాట కాంపిటీషన్‌కి తగినది కాదు' అని వ్యాఖ్యానించారు కొందరు.

'నీవే అతని ప్రైజ్ పోగొట్టావు' అన్నారు మా స్నేహితులు.

కాని, మీరు మాత్రం సంతోషంగా కనిపించారు, స్టేజి ఎక్కి ప్రేమ వెల్లడించుకున్నందుకేమో, మరి!

మీ సర్వస్వం నేనే అన్నట్లు ప్రవర్తించేవారు.

ఒకొక్కసారి మీ రిలా అవటానికి మన పేర్లు కలవటం కొంతవరకు దోహదం చేసిందేమో అనిపించేది.

కాని, నా పేరు కలవాళ్లు చాలా మంది ఉన్నారు. మీరు వాళ్లెవర్నీ పట్టించుకోనే పట్టించుకోరుగా?

రాత్రిళ్లు మీరు మా ఇంటిముందు నుండి అస్తమానూ తిరుగుతూంటే నాకు పుస్తకాల్లోదేమీ బుర్ర కెక్కేది కాదు.

ఇంట్లోవా ళ్లెవరైనా గమనిస్తే— అని భయం వేసేది.

న న్నేమీ అనరు. కాని, వాళ్లకి తెలిసిననాడు ఇంట్లోకూడా తల ఎత్తుకోలేకుండా అవుతుంది నా పరిస్థితి.

దీనికి పర్యవసానం ఎలాగ ఉంటుంది? అన్న ఆలోచనలతో తల వేడెక్కిపోయేది.

మనస్సుకుకూడా ఏ మాలిన్యమూ అంటకూడదని ఊహాల్ని పరుగులెత్తనీయకుండా నా శాయశక్తులా ప్రయత్నించేదాన్ని.

ప్రిపరేషన్ హాలీడేస్ ఇచ్చినా ఏమీ చదవలేకపోయాను.

కారణమేమో — మీరూ పరీక్షలకి వెళ్లలేదు.

నాకు కాలేజీలో, ఊళ్లో మీ ప్రేయసిగా పేరు స్థిరపడిపోయింది.

గుమ్మం దాటి బయట అడుగు పెట్టాలంటేనే సంకోచ మనిపించేది.

తప్పేమీ లేకుండానే అపరాధి నయాను నేను.

అన్నీ తెలిసిన, ఎంతో తెలివైన వారైన మీరే ఒక ఆడపిల్ల పరిస్థితిని గ్రహించ లేకపోయారు. లేక గ్రహించే పట్టించుకో లేదో!

ఇంతలో — పొరుగూరైనా — ఎలా తెలిసిందో మరి— ఈ సంగతంతా మీ ఊళ్ళోనూ, మీ ఇంట్లో వాళ్లకికూడా తెలిసిపోయిందట. ఆనందరావు చెప్పాడు అలాగని.

మీరు నాతో మాటాడగోరుతున్నారని చెపుతూ, ఒక్క మారు కాలేజీకి రమ్మని అభ్యర్థించాడు.

మన మొట్టమొదటిది—అదే ఆఖరిదీ అయిన ఆ సమావేశాన్ని ఏనాడూ మరిచిపోలేను నేను.

ఏమీ ఎరగనట్లే ప్రవర్తించారు మీరు.

'మీరు బాగా చదవండి. లాంగ్వేజెస్‌లో క్లాస్ తెచ్చుకోండి. ఫస్ట్ క్లాస్ తెచ్చుకొని యూనివర్సిటీకీ వెళ్లండి' అంటూ చెప్పారు.

'నేను మా ఊరు వెళ్లిపోతున్నాను. మళ్లా మనం కలుసుకోనటం చాలా అరుదేమో' అన్నారు.

నాకు రోషం, దుఃఖం ముంచుకొచ్చాయి. కాని పైకి ఏమీ అనలేక పోయాను.

అప్పుడుకూడా మీది అదే చూపు! ప్రేమాకాంక్షలు వెల్లివిరిసే చూపు!

విడిపోయాం మనం. తరవాత మీరు మీ ఊరు వెళ్లిపోయారు. కాని ఆ లోపల చాలామంది కళ్లలో పడ్డాము.

నేను మీతో చెప్పాను—'నే నింక ఈ కాలేజీలో చదవలేను. చదువు మానేయాలని నిశ్చయించుకున్నాను' అని.

ఎందు కలా అంటున్నానో మీరు అర్థం చేసుకున్నారు. మీ ముఖంలో ఒక్క క్షణంపాటు బాధ తొంగి చూసింది. కాని మరుక్షణంలో ఏమీ ఎరగనట్లే అయిపోయారు.

ఏదైనా గర్ల్స్ కాలేజీకి మారిపోయి చదువు కంటిన్యూ చేయవచ్చు. అక్కడి వాళ్లకీ తెలిసినా ఎదురుగా ఏమీ అనరు కాబట్టి. కాని తెలయటం తెలుస్తుంది. తరవాత యూనివర్సిటీకి వెళ్లినా, ఇంకపైన జీవితంలో ఏం చేసినా 'ఫలాని అబ్బాయి డార్లింగ్' అన్న భిరుదు నాకు పోదు.

నే నెంతో అభివృద్ధిలోకి వస్తాననీ, డాక్టరేట్ తెచ్చుకుంటాననీ ఎన్నెన్నో అనుకునేవారు మా తలిదండ్రులు.

చదువు మానేస్తున్నానని చెపితే షాక్ తిన్నట్లయి ఉంటుంది వారికి.

కారణం చెప్పమని ఎంతో బుజ్జగించారు నాన్నగారు.

కాని, నే నేమీ చెప్పలేదు కళ్లనీళ్ల పెట్టుకొనటం తప్పించి. మానసికంగా దెబ్బ తిన్నట్లు తెలుసుకున్నారు. కాని, ఎందుకో వారి కెలా తెలుస్తుంది?

సహజంగా ఇలాంటివి ఇంట్లోవాళ్ల దాకా రావటం కద్దు, మిగిలిన అందరికీ తెలిసిపోయినా.

ఒకవేళ తెలిసినా తెలియనట్లున్నారేమోకూడా! నన్ను మామూలు మనిషిగా చేయటానికి ప్రయత్నించేవారు.

నా నుండి తప్పు లేకుండానే సర్వం కోల్పోయాను నేను. నాకు భవిష్యద్ద్వారాలన్నీ మూతపడిపోయాయనే చెప్పాలి.

ఈ సంఘటన నా జీవితంలో నిప్పులే పోయవచ్చు.

గతం గుర్తువస్తే దుఃఖం పొర్లుకు వస్తుంది.

ఈ కన్నీటికి హద్దులు తెలియవు కాబోలు! తీరని ఆఘాతం కలిగించి నిష్క్రమించారు మీరు.

తట్టుకోలేక విలవిల కొట్టుకుంటూంది నా మనస్సు.

నేను 'అందనిదానను' అన్నారట! అందని దాననే అనుకుంటే ముందు నుండీ వెంటబడట మెందుకు? ఆ నాడే ఊరుకోలేకపోయారా?

నా జీవితంతో చెలగాట మాడదా మనుకున్నారా?


పిక్నిక్‌నాడు స్నేహితుల బలవంతంపై కొద్దిగా ప్రత్యేకంగానే అలంకరించుకున్నాను.

ఆ నాటి మీ చూపులలోని తృష్ణ పదేపదే గుర్తుకువచ్చి నా అంగాంగాలనూ దహించివేస్తుంది.

ఒక సినిమా చూసినట్లే చూశారు అందరూ మనని.

అయినా మీరు లక్ష్యపెట్టలేదు.

ఈ నాడు వాళ్ళు నన్ను గురించి ఏమనుకుంటారు?



మారిన కాలంలో రేస్ కోర్సులో—
గుర్రాలు: "కమాన్ శామ్!
కమాన్ రాజ్!
కమాన్ శంకర్!
కమాన్ గణపత్!"

మీ వాంఛ నిండిన నేత్రాలు నా పవిత్రతను మలినం చేశాయి.

పాపభీతి లేకపోతే ఆత్మహత్య చేసుకొనడానికి వెనుకాడేదాన్ని కాను.

పూలబాటపైనుండి నిర్దాక్షిణ్యంగా అనలైన మగవాడిలా నడిచి వెళ్లిపోయారు మీరు.

నలిగిన పూలు రోదిస్తున్నాయి. ఓదార్చే దెవరు?

అందరి దృష్టిలోనూ విశిష్టమైన వ్యక్తి మీరు.

మరి, నా ఎడల అలా ప్రవర్తించారేం?

మిమ్మల్ని నిలబెట్టి అన్నీ అడిగేయాలనిపిస్తుంది. కాని అలా చేయలేక పోయాను. ఎప్పటికీ చేయలేను, బహుశా!

నన్ను ఉద్దేశించి మీరు పాడిన పాటలు ఇప్పుడు నన్ను వెక్కిరించి ఫక్కుమంటున్నాయి.

కొన్ని నెలల పాటు ఆడుకుని ఆనందించారు మీరు.

మీతోబాటు మీ ఫ్రెండ్సందరికీ వినోదాన్ని కల్పించారు.

షోకేస్‌లో మీ ఆనందం కోసం పెట్టిన బొమ్మ ననుకున్న ట్టున్నారు మీరు.

అందరికీ ఎప్పుడూ మంచివారే అయారు. మీ వాళ్ల దగ్గర బుద్ధిమంతుడు అన్న పేరు పోగొట్టుకోకుండా ఉండటం కోసం నా మనస్సులో చిచ్చు పెట్టి వెళ్లిపోయారు.

ఆఖరికి ఆనందరావుకూడా—'అతను మంచివాడేనండీ, పాపం!' అన్నాడు.

మీరు నిజంగానే ప్రేమించి ఉండవచ్చు.

కాని, మీ భవిష్యత్తు కోసం అంతా విస్మరించి, నా మనస్సును నిర్దాక్షిణ్యంగా నలిపి వెళ్లిపోయారు!

నా లోని అణువణువూ మీ చూపులతో దగ్ధమైంది.

మీరు మీ తలిదండ్రులకి విధేయులుగా ఉండవలసినదే, కాదనను.

నలుగురిలో మీరు నా మూలంగా నగుబాటు అవాలనికూడా నా అభీష్టం కాదు.

మీరు తెగించి నన్ను వివాహం చేసుకొనటంకన్నా మనం ఎవరి కెవరమూ కాకుండా ఉండటమే ఇరువురికీ శ్రేయస్కరం. నిజమే.

కాని అన్నీ సక్రమంగా ఆలోచించి ఆచరించినవారు చివరికి వచ్చేసరికి అన్నీ మనస్సులో అణిచి వేసుకుని నిర్వికారంగా ఉండగలిగిన వారు—

మొదటినుండీ అలాగే ఉండలేక పోయారా?

మీ ప్రేమను బజారుపాలు చేసి, నా మనసూ, పరువూ, బ్రతుకూ నాశనం చేయుట మెందుకు?

మేరీ దుల్హాన్ అని చెప్పుకున్నారు అందరితో. ఈ నాడు ప్రపంచానికి నా ముఖ మెలా చూపను?

నన్ను మీ సొత్తుగా భావించినట్టు న్నారు.

ఘాటుగా ప్రేమించేయుటమూ, అవసరం లేదనుకున్నప్పుడు మరిచి పోగలగటమూ మీకు సహజం కాబోలు!

కాని ఆడపిల్ల నల్లరిపాలు చేసి, బ్రతుకు నంధకారమయం చేయడాని కా మాత్రం చాలు!

యుగయుగాలనుండీ జరుగుతున్న గాథ పునరావృత్తమయింది.

మరోసారి అమాయిక స్త్రీ పురుషుని దారుణానికి బలి అయింది.

ఈ జన్మలో మీ మోస హృదయం మిమ్మల్ని బాధపడనీయకపోయినా మరో జన్మలోనైనా ఈ ఉసురు తగలక మానదు.

ఈ రాధారాణిని క్రమంగా మరిచి పోగలరు మీరు.

కాని, నన్ను మీ గురించి లోకం ఏ నాటికీ మరువనీయదు!

మృత్యు వొక్కటే నన్నాదుకొన గలిగి నది!

నన్ను త్వరగా తనలో చేర్చుకొనమని భగవంతుడిని వేడటం మినహా చేయగలిగిం దేమీ లేదు.


ఈ లేఖ మీ కీ నాడు పంపబడక పోవచ్చును. పంపటం నా అభిమతమూ కాదు. నా మనస్సు కిది దర్పణం మాత్రమే.

మీకు భగవంతుడు సమర్థత నిచ్చాడు. ఏ పని చేయటానికైనా లోకం మీకు హక్కు నిచ్చింది. ఉన్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకొని మీరైనా వృద్ధిలోనికి వచ్చి హాయిగా బ్రతకండి.

ఈ అనుభవం నేర్పిన పాఠం సహాయంతోనైనా మరే అమ్మాయికీ కష్టం కలిగించకుండా మిమ్మల్ని మీరు అదుపులో పెట్టుకుంటే అంతే చాలు!

నిర్భాగ్యురాలుగా మిగిలిన...

—రాధారాణి." ★




గీతలలో నాతి

చిత్రం— జయశ్రీ

(సికింద్రాబాద్-3)